## క్లుప్తంగా

### ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్స్ జాతీయ సదస్సు



సదస్సుకు హాజరైన అతిథులు, అధ్యాపకులు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్స్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ ఎస్ సోమశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహాభారత కాలం నుంచి ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్ ముఖ్యభూమిక పోషిస్తోందన్నారు. ఆటోమోటివ్ వెహికల్స్, ఎరోప్లెన్స్, ట్రెన్స్, డిఫెన్స్ పరికరాలు, పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్‌లో ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్స్ పాత్రపై సదస్సులో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ, ప్రొఫెసర్ వి.దివాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ దామోదర్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.వెంకటరామయ్య, ధర్మారెడ్డి, రాజేష్ బాబు, శ్రీనివాసులురెడ్డి, పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విచ్చేసిన అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 16 నుంచి గోవిందుని బ్రహ్మోత్సవాలు

**తిరుపతి కల్చరల్:** శ్రీగోవిందరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 16 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. మే 15న సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం, రాత్రి వాహన సేవలు ఉంటాయి. మే 16న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, 17న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 18న సింహ వాహనం, ముత్యపు పందరి వాహన సేవలు నిర్వహిస్తారు. 19న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 20న మోహినీ అవతారంలో పల్లకీ సేవ, రాత్రి గరుడ వాహన సేవ జరుగుతాయి. 21న హనుమంత వాహనం, గజవాహనం, 22న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలను అధిరోహించి స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 23న రథోత్సవం, అశ్వవాహన సేవ, 24న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

### శ్రీవారి సేవలో నంగునేరి పీఠాధిపతి



**తిరుమల:** తిరుమల శ్రీవారిని శనివారం నంగునేరి పీఠాధిపతి పరమహంసేత్యాంతి మధురకవి వనమామాలి జీయర్ స్వామి దర్శించుకున్నారు. తిరుమల శ్రీబేడి ఆంజనేయ స్వామి వద్ద పీఠాధిపతికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేయండి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్‌కుమార్ ఘోష్

**తిరుపతి అర్బన్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్‌కుమార్ ఘోష్ తెలిపారు. శనివారం తిరుపతిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రధానంగా తిరుపతి పరిధిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్వీ క్యాంపస్ స్కూల్, సత్యనారాయణ పురం, కొర్లగుంట, తిరుమల తదితర పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. తిరుపతి పరిధిలోని నారాయణాద్రి హాస్పిటల్, విద్యానగర్, తిమ్మినాయుడు పాలెం వద్ద ఉన్న చెక్ పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

### తిరుపతిలో చిత్తూరు సంస్కృతి దుర్మార్గం

**తిరుపతి కల్చరల్:** ప్రశాంతమైన వాతావరణంతో ఆధ్యాత్మికత వెల్లువిరిసే తిరుపతి నగరంలో వలస నేత, కూటమి అభ్యర్థి చిత్తూరు సంస్కృతికి తీసుకొచ్చి అరాచకాలు సృష్టించేందుకు ప్రయతి్నంచడం దుర్మార్గమని వైఎస్‌ఆర్ సీపీ నేత, బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తిరుపతిలో ఓటు లేని జంగాలపల్లి శ్రీనివాసులు పోటీ చేయడం, ఆయనతోపాటు ఓటు లేని వారిని 25 మందికిపైగా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయించడం వెనుక మర్మమేంటో తిరుపతి ప్రజలు గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో ఘర్షణ వాతావరణం సృష్టించి అలజడులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి గెలవాలనుకోవడం వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనమన్నారు. తిరుపతి వాసులు ఇలాంటి విష సంస్కృతిని సహించరని, ఆమోదించరని స్పష్టం చేశారు. తిరుపతిలో శాంతియుతంగా ఎన్నికలు జరిగే విధంగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన మేరకు కేంద్ర భద్రతా బలగాలతో ఇటు భక్తులకు, అటు పౌరులకు భద్రత కల్పించాలని కోరారు. చిన్న వయస్సులోనే ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ అభివృద్ధిని పరుగులు తీయించిన నాయకత్వ లక్షణాలను కలిగిన భూమన అభినయ్‌ని ప్రజలు గెలిపించి అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

- అభివృద్ధికి చిరునామాగా తిరుపతి అభివృద్ధి
- ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- తిరుపతి 1, 50వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో భూమన అభినయ్

**తిరుపతి మంగళం:** కులం, మతం చూడలా.. ఏ పార్టీ అని కూడా చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్‌ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ తెలిపారు. తిరుపతి 1, 50వ డివిజన్‌లలో శనివారం కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అభినయ్ వేలాది మందితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా అభినయ్‌కి స్థానిక ప్రజలు హారతులతో నీరాజనం పలికారు. గజమాలలతో సత్కరించి అపూర్వ స్వాగతం పలికారు. తిరుపతి అభివృద్ధి ప్రదాత అభినయ్... నువ్వే మా ఎమ్మెల్యే అంటూ స్థానిక ప్రజలంతా ముక్తకంఠంతో తెలిపారు. ఈ సందర్భంగా అభినయ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేయని 2 లక్షల మందికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. తిరుపతి రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ చేయని విధంగా అభివృద్ధి చేసి అభివృద్ధికి చిరునామాగా మార్చానని సగర్వంగా చెప్పారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు, వినాయకసాగర్ అభివృద్ధి, నగర ప్రధాన కూడళ్ల సుందరీకరణ వంటివి అభివృద్ధి చేయడం గత పాలకులకు చేత కాలేదా అని ప్రశ్నించారు. తిరుపతిలో ఏళ్ల తరబడి పాలకులుగా ఉన్న వారికే తిరుపతి అభివృద్ధి పట్టనప్పుడు, చిత్తూరు నుంచి దిగుమతి చేసుకున్న నాయకుడికి ఎలా పడుతుందన్నారు. తాను ఇక్కడే పుట్టిన వాడిగా తిరుపతిపై ఉన్న మమకారం, ప్రజలపై ఉన్న అభిమానం ఎనలేనిదన్నారు.అందుకే తిరుపతి ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి ఆశీర్వదిస్తే తిరుపతిని మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. అలాగే యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా తిరుపతికి ఐటీ కంపెనీలు తీసుకొస్తానన్నారు. యువతకు బంగారు భవిష్యత్తు కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, సాయిరెడ్డి, కుప్పయ్య, రామకృష్ణారెడ్డి, శివప్రసాద్ యాదవ్, బాబూయాదవ్, జయచంద్రారెడ్డి, రమణాయాదవ్ చెంగల్‌రాయులు, యువరాజ్, మణి, బుజ్జయ్య, రవి, మహేష్, బుజ్జిరెడ్డి, పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జనసందోహంలో ఓ భాగం



ఎన్నికల ప్రచారంలో స్థానిక ప్రజలకు అభివాదం చేస్తున్న అభినయ్



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న భూమన అభినయ్



ఎన్నికల ప్రచారంలో అభినయ్‌కి హారతులు పడుతున్న మహిళలు

## ముస్లింలను నాశనం చేసేందుకు బీజేపీ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి

**తిరుపతి కల్చరల్:** ముస్లింలంటే నరనరాన వివక్షత జీర్ణించుకుని వారిని సర్వనాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్న ముస్లింల ద్రోహి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమని, ఆ బీజేపీతో జతకట్టిన కూటమిని నమ్మితే ముస్లింలకు భవిష్యత్ అంధకారమేనని వైఎస్‌ఆర్ సీపీ మైనారిటీ నేతలు స్పష్టం చేశారు. శనివారం ఖాద్రి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్‌ఆర్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాదర్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా మాట్లాడారు. ఆది నుంచి బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై విషపూరిత నిర్ణయాలతో వారిని దగా చేస్తోందన్నారు. ముస్లింల ద్రోహి అయిన బీజేపీతో టీడీపీ, జనసేన కుమ్మక్కై కూటమి పేరుతో కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పిన బీజేపీ తీరుపై కూటమి నేతలు స్పందించాలన్నారు. అణగారుతున్న ముస్లింలను అక్కున చేర్చుకొని వారి సంక్షేమానికి బాటలు వేసి ముస్లింల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముస్లింల సంక్షేమ సారథి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ముస్లిం కటుంబం తమకు ఉన్న రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించుకుని అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ నేతలు ఎస్‌ఎం బాషా, చినస్వామిరెడ్డి పాల్గొన్నారు.

## అధికారం దాహంతో కూటమి కుయుక్తులు



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరే అజయ్‌కుమార్

**తిరుపతి కల్చరల్:** అధికారం దాహంతో బరితెగించి కూటమి నేతలు కుయుక్తులు పన్నుతూ అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తున్నారని వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం నేతలు కూటమి నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరే అజయ్‌కుమార్, పసుపులేటి సురేష్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 610 హామీలలో ఎన్ని అమలు చేశారో కూటమి అభ్యర్థులు ప్రజలకు వివరించాలన్నారు. అధికారం కోసం కుట్ర రాజకీయాలు నడుపుతూ ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి జనరంజక పాలన సాగించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి నేతలు సిగ్గు విడిచి విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. తిరుపతి అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయని నరసింహ యాదవ్, పసుపులేటి హరిప్రసాద్ వలస నేత ఆరణికి వత్తాసు పలకడం వారి అవకాశ వాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులుకు ప్రజా బలం ఉంటే పార్టీ టిక్కెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా ఎందుకు పోటీ చేయలేదో పసుపులేటి హరిప్రసాద్ సమాధానం చెప్పాలన్నారు. కూటమి నేతల కుయుక్తులు ఎదుర్కొని బదులిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం నేతలు వంశీ, రాజ్‌కుమార్, ధీరజ్ పాల్గొన్నారు.

## కరువు కేరాఫ్ బాబు



సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా భాగంగా 12వ డివిజన్‌లో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఆ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌కి మద్దతుగా పాత తిరుచానూరు రోడ్డులో చిన్నపాటి టిఫిన్ హోటల్ నడుపుతున్న శాంతమ్మను ఓటు అడిగారు. ఆమె సమాధానం ఇస్తూ నాకు పెన్షన్‌కు అప్‌లై చేశాను. జగన్ గెలిస్తే పెన్షన్ నాకు వస్తుందని తెలిపింది. టీడీపీ చంద్రబాబు ఎక్కువ ఇస్తాడని అంటున్నారే అని ఆమెను ప్రశ్నించారు. ఆమె తిరిగి సమాధానం ఇస్తూ చంద్రబాబు జమానాలో అన్ని కరువు కాటకాలేనని, తాగేందుకు నీళ్లు లేక ఇబ్బంది పడ్డామని తెలిపింది. కరువుకు ఆయన కేరాఫ్ అన్న ఆమె మాటలకు వైఎస్‌ఆర్ సీపీ నేతలు అంతా ఒక్కసారిగా నవ్వుకున్నారు. ఆనందంతో చప్పట్లు కొట్టి జై జగన్ అంటూ ముందుకు సాగారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన

**తిరుపతి కల్చరల్:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన తిరుపతి కూటమి ఎంపీ అభ్యర్థిని ఎన్నికల పోటీకి అనర్హుడుగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేసి పచ్చపత్రికల్లో ప్రచురించుకున్న పెయిడ్ ఆర్టికల్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఈనెల 22వ తేదీ, 27వ తేదీన పచ్చపత్రికల్లో పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురించిన వారికి 60 లక్షలు ముట్టజెప్పారని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు షేక్ జావెద్, వెంకటేష్ గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

### దళితుల్ని అవహేళన చేస్తున్న టీడీపీ నేత



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు

**తిరుపతి కల్చరల్:** టీడీపీ స్వార్థ రాజకీయాల కోసం దళితులపై వివక్ష చూపుతూ అవహేళనగా దుర్భాషలాడడం దుర్మార్గమని వైఎస్‌ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు విమర్శించారు. దళితులను అవమానకరంగా మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు దళితులపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి దళితుల్ని అంటరానివారిగా చూస్తూ కించపరిచేలా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. టీడీపీ నేతలు దళితుల్ని టార్గెట్ చేసి అవహేళన చేయడం వారి కులపిచ్చి రాజకీయాలకు నిదర్శనమన్నారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో ఐఏఎస్ అధికారిగా అనేక పదవులు అనుభవించి బయటకు వచ్చిన విజయకుమార్ సీఎం జగన్‌ను దళిత వ్యతిరేకి అని విమర్శ చేయడం అమానుషమన్నారు. ఆయన సర్వీస్‌లోనున్న రోజుల్లో దళితులకు చేసింది శూన్యమన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లినా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచిన దళితుల్ని విమర్శిస్తే రాష్ట్రంలోని కోటి మంది ఎస్సీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### భావితరాలకు మార్గదర్శకం శ్రీరాముని జీవితం

**తిరుపతి కల్చరల్:** సనాతన ధర్మాన్ని ఆచరణలో పెట్టి మంచి పరిపాలనను సామాన్య ప్రజలకు అందుబాటులోకితీసుకొచ్చిన శ్రీరామచంద్రుని జీవితం భావితరాలకు మార్గదర్శకమని ప్రముఖ మానసిక వికాస నిపుణుడు చంద్రమౌళి తెలిపారు. శనివారం రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో పోస్టల్ కాలనీ, కొరమేనుగుంటలో శ్రీరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులకు చేతికర్రలు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

# ప్రజల మనిషి అభినయ్



41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ సతీమణి మోనీష

**తిరుపతి మంగళం:** నిత్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపించే యువనాయకుడు భూమన అభినయ్ అని ఆయన సతీమణి భూమన మోనీష తెలిపారు. తిరుపతి 41వ డివిజన్‌లో కార్పొరేటర్ స్రవంతి, అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కుటుంబాన్ని సైతం వదిలిపెట్టి నిత్యం ప్రజా సంక్షేమం కోసం శ్రమించే ప్రజల మనిషి అభినయ్ అని ఆమె తెలిపారు. పండగొచ్చినా, పబ్బం వచ్చినా నా ఇల్లు తిరుపతే, నా కుటుంబం నగర ప్రజలే అంటూ జనంతో కలిసి సంబరాలు చేసుకుంటారన్నారు. తిరుపతి అన్నా, ప్రజలు అన్నా అభినయ్‌కి అంత పిచ్చిప్రేమ, అభిమానం అన్నారు. అతిచిన్న వయసులోనే తిరుపతి నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసిన తన భర్త భూమన అభినయ్‌ని మీ ఇంటి బిడ్డగా భావించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని స్థానిక ప్రజలను ఆమె అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో అభినయ్‌ని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే తిరుపతిని ఇంతకు మించి అభివృద్ధి చేసి చూపుతారన్నారు.

## పేదల మేనిఫెస్టోపై హర్షం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పేదలకు మేలు చేసే మేనిఫెస్టోగా అంతా అభివర్ణిస్తున్నారు. – తిరుపతి తుడా

### వైఎస్‌ఆర్ సీపీ మేనిఫెస్టో పేదలకు కొండంత అండ



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత లక్ష్యంతో విడుదల చేసిన మేనిఫెస్టో పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ మేనిఫెస్టోతో రైతులు, మైనారిటీలు, బీసీలు, ఈబీసీలు ఆత్మవిశ్వాసంతోపాటు ఆత్మగౌరవంతో జీవిస్తారని పేర్కొన్నారు. మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా రూపొందించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించేందుకు బీసీలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

– ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి

### అది మాయ... ఇది నిజం



చంద్రబాబు అధికారం కోసం ఎన్నికల్లో అలవికాని రీతిలో హామీలు ఇస్తాడు. హామీలకు వెన్నుపోటు పొడవడం బాబుకు సదా మామూలే. మూడుసార్లు ముఖ్యమంత్రి చేసిన వ్యక్తి ఇంకా నేను అది చేస్తా ఇది చేస్తా అని చెప్పుకుంటున్నాడు. అంతే తప్ప ఇది నేను చేసి చూపించానని చెప్పుకొనే ధైర్యం లేదు. 2014 ఎన్నికల్లో 650కి పైగా హామీలు ఇచ్చి, వాటిలో ఎన్ని అమలు చేశాడో చెప్పుకోలేని దయనీయ స్థితిలో బాబు ఉన్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావిస్తానని చెప్పాడు. అంత పవిత్రంగా భావించి 2019లో ఇచ్చిన ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసి చూపించారు. జగన్ మాట ఇస్తే మడమ తిప్పడు అని మరోసారి నిరూపించుకున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్‌ఆర్ సీపీ మేనిఫెస్టో నమ్మదగినది. ప్రజల మన్ననలు పొందుతుంది. చంద్రబాబు మేనిఫెస్టో ఓ మాయ, జగన్ మేనిఫెస్టో ఓ నిజం. – టి. దాసు, దళిత సంఘాల నాయకుడు, తిరుపతి

### జగనన్న ప్రతి హామీని అమలు చేస్తాడు



జగనన్న మాట ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాడు. అమ్మ ఒడి, రుణమాఫీ, ఆసరా, సొంత ఇంటి స్థలాన్ని నాకు అందించాడు. గతంలో డ్వాక్రా రుణ మాఫీ అని చెప్పి నాలుగున్నరేళ్లు బాబు మాయ చేశారు. నిరుద్యోగ భృతి పేరుతో యువతను తీవ్రంగా వంచించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి మాయ మాటలు చెప్పారు. జగన్ అన్న అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే హామీలను అమలు చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దాదాపుగా అమలు చేసి చూపించారు. కోవిడ్ మహమ్మారి రెండేళ్లపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసింది. కోవిడ్‌ను సాకుగా చెప్పి హామీలను విస్మరించకుండా విపత్కర పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన అందించారు. జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో ఆమోదయోగ్యంగా, అమలు చేసేలా ఉంది. అయినా జగనన్న మాట ఇస్తే ఇక వెనక్కి తిరిగి చూడడు అమలు చేసే చూపిస్తారు. – జయంతి, తిరుపతి

## క్లుప్తంగా

### సిద్ధలింగంకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళి


సిద్ధలింగం పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

**చంద్రగిరి:** నరసింగాపురం గ్రామానికి చెందిన సిద్ధలింగం(71) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నరసింగాపురంలోని మృతుడి నివాసానికి చేరుకుని సిద్ధలింగంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, సర్పంచ్ చెంచురత్నం శెట్టి, డివిజన్ అధ్యక్షుడు దేవా రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

### పనపాకం హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్


పనపాకం జెడ్పీ ఉన్నత పాఠశాల

**చంద్రగిరి:** పనపాకం పంచాయతీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదివేందుకు వీలుగా పనపాకం హైస్కూల్ ప్లస్ వన్ (జూనియర్ కాలేజీ)గా మార్పు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తిరుపతి జిల్లాలో 17 హైస్కూల్స్‌ను ప్లస్ వన్‌గా మార్పు చేసింది. అందులో పనపాకం హైస్కూల్‌కు స్థానం దక్కింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్మీడియెట్ అందుబాటులోకి రానుందని డీఈవో శేఖర్ తెలిపారు. పనపాకం హైస్కూల్ ప్లస్ వన్(జూనియర్ కాలేజీ)గా చూడాలనే కల నేటికి నెరవేరిందని పనపాకం హైస్కూల్ మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ పానేటి చెంగల్రాయులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### నేడు వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీ

**రామచంద్రాపురం:** మండలంలోని సీరామాపురం పంచాయతీ నుంచి నెన్నూరు వరకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైక్‌పై ర్యాలీగా వెళ్లి నెన్నూరులో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరై సభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

### అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం


- టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ వ్యక్తికి పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

**చంద్రగిరి:** ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన దాడిలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ కార్యకర్త సాయికిరణ్ యాదవ్‌ను చెవిరెడ్డి లక్ష్మి శనివారం పరామర్శించారు. అధైర్య పడవద్దు.. మీ కుటుంబానికి అండగా ఉంటాం .. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పర్వం జరుగుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన ఆకస్మిక దాడిలో చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన సాయికిరణ్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స తర్వాత ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతన్ని చెవిరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. శనివారం ఆమె గాయపడ్డ సాయికిరణ్ యాదవ్ ఇంటికి చేరుకుని ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తొండవాడ సర్పంచ్ మల్లం దీపికా రెడ్డి ఆ కుటుంబ సభ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ అభ్యర్థి ఆరోపణలు అవాస్తవం

**తిరుపతి కల్చరల్:** ఈ నెల 25న తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగిన నామినేషన్ ఘట్టంలో జరిగిన ఘర్షణకు తెలుగుదేశం పార్టీ జెండా తొక్కడమే కారణమని ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి పులివర్తి నాని అవాస్తవాలు మాట్లాడడం దుర్మార్గమని నర్సింగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత మల్లం చంద్రమౌళిరెడ్డి విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.


మాట్లాడుతున్న నర్సింగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు మల్లం చంద్రమౌళిరెడ్డి

పూటకొక మాట, రోజుకొక పార్టీతో లేకుండా నీతి, నిజాయితీగా వ్యవహరించే కుటుంబం తమదని స్పష్టం చేశారు. టీడీపీ కార్యకర్తలు చేసిన అరాచకంలో తన కుమారుడు టీడీపీ జెండా తొక్కాడని నాని చెప్పడం అవకాశ వాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేసే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై నాని నిందారోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గం ప్రజలను తన కుటుంబంగా చూస్తూ ఆపద సమయాల్లో వారికి అండగా నిలిచిన దమ్మున్న నాయకుడని స్పష్టం చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని కోరుకున్న ప్రజలు 2019 ఎన్నికల్లో 43 వేల ఓట్ల మెజారిటీతో ప్రజలు గెలిపించారన్నారు. రానున్న ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని 50 వేలకుపైగా మెజారిటీతో గెలిపించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈఆర్‌ఓ కార్యాలయం వద్ద 100 మీటర్ల ఆంక్షలు దాటి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వచ్చి అరాచకం సృష్టించిన ఘటన వాస్తవం కాదా అని ప్రశ్నించారు.


మహిళలకు అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

# వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అద్భుతం

- ప్రజల్లో ఉప్పొంగిన ఆనందం
- సీఎం జగన్‌తో నిరుపేదల బతుకుల్లో వెలుగులు
- మన ఊరు.. మన మోహిత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- సాయినగర్ పంచాయతీలో రూ.9.28 కోట్లు
- లింగేశ్వర నగర్‌లో 73 పనులకు రూ.5.88 కోట్లు


హారతులతో ఆత్మీయ స్వాగతం

**తిరుపతి రూరల్:** వైఎస్సార్ సీపీ విడుదల చేసిన నవరత్నాల మేనిఫెస్టో అద్భుతమని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపి సంక్షేమ పథకాల సృష్టికర్తగా ప్రజల హృదయాలలో నిలిచారన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం సాయినగర్, లింగేశ్వర నగర్ పంచాయతీలలో మన ఊరికి.. మన మోహిత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు డీవీ రమణ, కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. గడప గడపలోనూ మోహిత్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు హారతులు పట్టి ఆత్మీయత కనబరిచారు. చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అంతకుముందు సాయినగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత కోరిక మేరకు మోహిత్‌రెడ్డి బైక్ నడిపారు. సాయినగర్ పంచాయతీలో 98 పనులను రూ.9.28 కోట్లు నిధులు, లింగేశ్వర నగర్ లో 73 పనులను రూ.5.88 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి శరవేగంగా పరుగులు పెట్టిందన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

**మేనిఫెస్టోతో వెల్లివిరిసిన ఆనందం**

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన రెండు పేజీలతో కూడిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతో ప్రజల్లో ఆనందం వెల్లి విరిసిందన్నారు. ఐదు సంవత్సరాల పాటు అమలు చేస్తున్న పథకాల విస్తరణతో పాటు 9 ముఖ్యమైన హామీలను పెంపు చేస్తూ మేనిఫెస్టో ప్రకటించారన్నారు. ఇందులో రూ.3,500 వరకు రెండు విడతల్లో పెన్షన్ పెంపు, అమ్మ ఒడి రూ.2 వేల పెంపుతో రూ.17 వేలు, నాలుగు దఫాల్లో ఈబీసీ నేస్తం 45 వేల నుంచి రూ.1.05 లక్షల మేర పెంపు, నాలుగు దఫాల్లో రూ.60 వేల నుంచి రూ.1.20 లక్షలకు, వైఎస్సార్ రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు.. కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపు, ఆటోలకు, ట్యాక్సీలు కొనుగోలు చేసేవారికి వడ్డీ రాయితీ.. వాహన మిత్రను ఐదేళ్లలో రూ.50 వేల నుంచి రూ.1 లక్ష పెంపు వంటి తదితరాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకునేలా మేనిఫెస్టో రూపొందించారని కొనియాడారు.

**రౌడీ రాజకీయాలు తగదు**

చంద్రగిరిలో చిత్తూరు రౌడీ సంస్కృతి వద్దని హితవు పలకడం తప్పేమీ కాదు.. ఈ ఐదేళ్లు కనిపించని ప్రతిపక్ష పార్టీ నేతలు నేడు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదన్నారు. కులాలు, మతాలను రెచ్చగొట్టేది ఎవరో ప్రజలకు తెలుస్తోందన్నారు. కరోనా విలయతాండవం చేస్తుంటే కనీసం టీడీపీ కార్యకర్తలకు కూడా దిక్కులేదన్నారు. అలాంటిది ప్రజలను పట్టించుకొనే ఆలోచన వారికి ఎక్కడిదని ఆరోపించారు. ఓటమి భయంతో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రౌడీ సంస్కృతికి, స్థానికేతరులకు మే 13న ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి, ఎంపీటీసీ హేమలత వినోద్ కుమార్, నాగభూషణమ్మ, మజీ ఎంపీటీసీ పద్మ, చెన్నారెడ్డి, మోహన్, కుమార్, శీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం


బహిరంగ సభలో అభివాదం చేస్తున్న మోహిత్‌రెడ్డి

### మోహిత్‌రెడ్డిని గెలిపిద్దాం..

# అభివృద్ధిని కొనసాగిద్దాం


తొండవాడ పంచాయతీలో ఎన్నికల ప్రచారం

- చంద్రగిరి చరిత్రపై చెరగని చెవిరెడ్డి ముద్ర
- మోహిత్‌ను ఎమ్మెల్యేగా ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో చెవిరెడ్డి లక్ష్మి

**చంద్రగిరి:** ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించండి.. అభివృద్ధిని కొనసాగించండి.. అంటూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని తొండవాడ పంచాయతీలో శనివారం సర్పంచ్ మల్లం దీపిక ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చెవిరెడ్డి లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆమెకు స్థానిక ప్రజలు కర్పూర హారతులు పట్టి, ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఇంటా సత్కరించి ఆప్యాయతను చాటుకున్నారు. తండ్రికి తగ్గ తనయునిగా ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన మోహిత్‌ను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని చెవిరెడ్డి లక్ష్మి చేసిన విజ్ఞప్తికి అక్కడి మహిళలు తప్పకుండా ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపిస్తామని మాట ఇచ్చారు. జగనన్న పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ మే 13వ తేదీ జరిగే పోలింగ్‌లో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి పదేళ్లుగా చేసిన మేలును గుర్తు చేస్తూ ఆయన బిడ్డను గెలిపించాలని కోరారు. చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. చంద్రగిరి చరిత్రపై ఎమ్మెల్యే చెవిరెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు. జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ఆనందంగా గడిపే ప్రతి కుటుంబం బాధ్యతగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. మోహిత్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక మహిళలు చెవిరెడ్డి లక్ష్మితో కలిసి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.


ఫ్యాను గుర్తుకు ఓటేసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

**ఓటుతో కృతజ్ఞత తీర్చుకుంటాం**

గత ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలకన్నా అధికంగా మాకు మేలు చేసిన ఈ జగనన్న ప్రభుత్వానికి మరోసారి ఓటు వేసి కృతజ్ఞతను తీర్చుకుంటామంటూ తొండవాడ పంచాయతీ ప్రజలకు ముక్తకంఠంతో చెవిరెడ్డి లక్ష్మికి తెలియజేశారు. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనా మహమ్మారికి దేశ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, చంద్రగిరి నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి అండగా నిలిచి అన్నీతానై ఆదుకున్నట్లు వారు గుర్తు చేసుకున్నారు. మంచి చేస్తున్న చెవిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని, ఎన్ని పార్టీలు కలసి సొచ్చినా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత తమదేనని వారు తేల్చి చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసిన చెవిరెడ్డి లక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.

# బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

**చంద్రగిరి:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.


బంగారు తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లు

# మోహిత్ అన్నయ్యను ఆశీర్వదించండి


ఎన్నికల ప్రచారంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- అనునిత్యం అందుబాటులో ఉంటాం
- చంద్రగిరి అభివృద్ధిని కొనసాగిస్తాం
- తిరుచానూరులో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అపూర్వ ఆదరణ

**చంద్రగిరి(తిరుచానూరు):** నియోజకవర్గ అభివృద్ధిని కొనసాగించడానికి మోహిత్ అన్నయ్యను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఆయన సోదరుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అభ్యర్థించారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ పరిధిలో సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయనకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలవగానే అందరికీ అందుబాటులో ఉండి ఎవ్వరికి ఏ అవసరం వచ్చినా దగ్గరుండి పరిష్కారం చేస్తామన్నారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు అతీతంగా ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు

**అడుగడుగునా అపూర్వ ఆదరణ**

వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గెలుపు కోసం తిరుచానూరు పంచాయతీలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చేపట్టిన ప్రచారంలో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి గడపలో మహిళలు హారతులు పట్టి ఆత్మీయతను పంచారు. మోహిత్‌రెడ్డిపై ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రణధీర్‌పురంలో టీడీపీకి షాక్


తిరుపతి రూరల్ : రణధీర్‌పురంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


తిరుపతి రూరల్: సాయినగర్ ఎంపీటీసీ వినోద్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**తిరుపతి రూరల్:** రణధీర్‌పురం పంచాయతీలో టీడీపీకి షాక్ మీద షాక్ తగులుతోంది. పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు రెడ్డెప్ప, వేణు, ప్రసాద్, వంశీ, ఢిల్లీ, యోగి, శ్రవంతి, సుగుణమ్మ, పద్మతో పాటు 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. తుమ్మలగుంటలో వారికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పంచాయతీ ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, నాయకులు పాల్గొన్నారు.

**టీడీపీలో కొనసాగలేం**

'చంద్రగిరి టీడీపీలో నియంతృత్వ పాలన నడుస్తోంది. పార్టీలోకి ఆహ్వానించినప్పుడు ఎక్కడ లేని ప్రేమను నటించిన చిత్తూరు కమల్‌హాసన్, పార్టీ కండువా కప్పుకున్నాక తనలోని నియంతృత్వాన్ని బయటకు తీసి అవమానిస్తున్నాడు. ఆ నియంతృత్వాన్ని భరించలేం' అని సాయినగర్ ఎంపీటీసీ వినోద్‌కుమార్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం చిత్తూరులో స్థిర నివాసం ఉండే వ్యక్తి వినోద్‌కుమార్‌ను మంగళగిరికి తీసుకెళ్లి నారా లోకేష్ చేతుల మీదుగా టీడీపీ కండువా వేయించారు. తాను చంద్రగిరిలో ఎంత కష్టపడుతున్నాడో...అంటూ భారీ బిల్డప్ ఇచ్చాడు. టీడీపీలోకి వెళ్లిన నాటి నుంచి ప్రశాంతంగా లేని వినోద్‌కుమార్ శనివారం తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి తిరిగి వచ్చారు. తుమ్మలగుంటలో ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ... తల్లిలాంటి వైఎస్సార్ సీపీని వదిలి, చిత్తూరు నుంచి దిగుమతి అయిన నేత వద్దకు వెళ్లడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. అందుకే మళ్లీ వైఎస్సార్ సీపీలోకి వచ్చినట్లు చెప్పారు. చిగురువాడ సర్పంచ్ ముచ్చెలి ప్రదీప్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు శ్రీరాములు, తులసిరెడ్డి, శంకరానందరెడ్డి పాల్గొన్నారు.

# జగనన్న సీఎం అయితేనే పేదరిక నిర్మూలన


ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్న చెవిరెడ్డి మంజుల

**చంద్రగిరి:** పేదల పక్షాన నిలబడి నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు జనరంజక పాలన అందించిన జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే పేదరికం పోతుందని చెవిరెడ్డి మంజుల అన్నారు. జగనన్న ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమం.. ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన .. అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయండి.. రాబోయేది మళ్లీ జగనన్న ప్రభుత్వమే అందరికీ మంచి జరుగుతుందన్నారు. మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీ పరిధిలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ చెవిరెడ్డి కుటుంబం అందించిన సాయాలను గుర్తు చేశారు. అలాగే మోహిత్‌రెడ్డికి చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తూ జగనన్న ఆశీర్వదించి జనం ముందుకు పంపించారని, అందరం ఆ బిడ్డను ఆదరించి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. చెవిరెడ్డి బిడ్డగానే కాదు.. మీ అందరూ మెచ్చిన నాయకుడిగా ఎదగడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద చెవిరెడ్డి మంజులకు హారతి పట్టి సాదరంగా స్వాగతం పలికిన మహిళలు మోహిత్ రెడ్డిని తమ బిడ్డగా ఆదరిస్తామని చెప్పి తమ మద్దతు తెలిపారు. కష్టంలో ఆదుకునే మనస్సు కలిగిన చెవిరెడ్డి బిడ్డకు భగవంతుడు మంచి చేస్తాడని, వచ్చే ఎన్నికల్లో విజయం వరించాలని పలువురు వృద్ధులు తమ ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.